ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

గురువారం 27 ఫిబ్రవరి 2025 | 5





మండపేట.. ద్వారపూడిలో ఆదియోగి

భక్తజన సందోహం.. పలికెను శివోహం..



పిఠాపురం పాదగయకు తరలివచ్చిన భక్తజనం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శైవక్షేత్రాలు ఓం నమశ్శివాయ స్మరణతో మార్మోగాయి. వేకువజాము నుంచే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రముఖ శివాలయాలు కిటకిటలాడాయి. పాదగయ, ద్రాక్షారామ, సామర్లకోటకు భక్తజనం తరలివచ్చారు. రాజమహేంద్రవరం గోదావరి పుష్కరఘాట్లు పుణ్యస్నానాలు ఆచరించే భక్తులతో పోటెత్తాయి..

..వార్తలు 7లో



ద్రాక్షారామ: ఘంటాంబిక ఆలయం వద్ద పుష్పాలంకరణ



ఐ.పోలవరం: మురమళ్లలో భక్తుల రద్దీ



రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద ..

భక్తజనంతో కిటకిటలాడుతున్న రాజమహేంద్రవరం పుష్కరాల రేవు



పాదగయలో జంగందేవర



పిఠాపురం: పాదగయలో



భక్తిగీతాలు ఆలపిస్తున్న మంగ్లీ



సామర్లకోట భీమేశ్వర ఆలయం వద్ద..



ద్రాక్షారామంలో మహాశివరాత్రి సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరైన జనం



ప్రమాదంలో మృతి చెందిన యువకులు ఫ్లెక్సీతో మిత్రుల నివాళి

తల్లడిల్లిన 'తాడిపూడి'



మృతదేహాలను తరలిస్తున్న దృశ్యం

ఇసుక మేటలే అనుకుని... గోతుల్లోకి జారి ఐదుగురు బలి

రాజమహేంద్రవరం/ తాళ్లపూడి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): గోదావరిలో ఇసుకమేటలే కదా అని ఎక్కువ నీరున్న చోటకు నడుస్తూ లోతైన గోతుల్లోకి జారిపోయి ఐదుగురు విద్యార్థులు జలసమాధి కావడం తాడిపూడి ప్రజలను తీవ్రంగా కలచివేచింది. శివరాత్రి పర్వదినం రోజున పుణ్యస్నానాలకు వెళ్లి తిరిగిరాని లోకాలు ఈ యువకులు వెళ్లిపోవడంతో ఊరు ఊరంతా కన్నీటి పర్యంతమైంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఇక్కడ డ్రెడ్జింగ్ చేసి ఇసుక తవ్వేసి పెద్ద గోతులు పెట్టడమే ఈ ప్రమాదానికి కారణమని గ్రామస్తుల ప్రధాన ఆరోపణ. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తాడిపూడికి చెందిన గర్రె ఆకాశ్ (17), తిరుమలశెట్టి పవన్ (19), పడాల దేవదత్తసాయి (18), పడాల రామదుర్గాప్రసాద్ (19), అనిశెట్టి పవన్‌గణేశ్ (17), మరో ఏడుగురు శివరాత్రి స్నానానికి ఊరికి దగ్గరలో ఉన్న గోదావరిలో ఇసుక ర్యాంపు వద్దకు వెళ్లారు. ఐదురుగు ముందుగా స్నానానికి వెళ్లగా, మిగతా ఏడుగురు గట్టుమీదే ఉన్నారు. స్నానానికి వెళ్లిన వాళ్లలో ఆకాశ్, దత్తసాయి తొలుత గోదావరిలో ఇసుక మేటలు వేయడంతో ఓ పది అడుగులు ముందుకు వెళ్లి స్నానం చేస్తూ.. కాస్త పక్కన నీళ్లు కొద్దిగా నీలం రంగులో ఉండడం గమనించి అటువెళ్లి గోతిలోకి జారిపోయారు. వారిని రక్షించే ప్రయత్నంలో మరో ముగ్గురు దుర్గాప్రసాద్, తిరుమలశెట్టి పవన్, అనిశెట్టి పవన్ కూడా గోతుల్లోకి జారిపోయారు. ఇందులో తిరుమలశెట్టి అనిల్‌కు ఈతవచ్చు. కానీ ఒకరిని రక్షించబోయి మిగతావారు మునిగిపోయారు. ఇసుక ర్యాంపు కోసం ఒడ్డున పాక వేస్తున్న కూలీలు వీళ్ల కేకలు విని ఊళ్లో వారికి సమాచారం ఇచ్చారు. ప్రతి శివరాత్రి రోజున గ్రామంలో మజ్జిగ పంపిణీ చేస్తుంటారు. బుధవారం కూడా మజ్జిగ సిద్ధం చేస్తున్నారు. మృతుడు తిరుమలశెట్టి పవన్ చిన్నాన్న తిరుమలశెట్టి శ్రీనివాస్ వాళ్లను చూసి మజ్జిగ పంపిణీకి ఇప్పటికే ఆలస్యమైంది, త్వరగా రండి అని చెప్పి ఏర్పాట్లలో ఉండిపోయాడు. గోదావరిలో స్నానం చేసి వచ్చేద్దామని అనుకొని ఈ 12 మంది వెళ్లిపోయారు. ఈలోపు మజ్జిగ పంపిణీ ఏర్పాట్లలో ఉన్న తాను కరివేపాకు కోసం వెళ్లగా 8.10 గంటలకు దుర్వార్త వినాల్సి వచ్చిందంటూ శ్రీనివాస్ విలపించారు. ఇక తాడిపూడిలోని మూడు వీధుల్లోని జనం మధ్య ఏదోక బంధుత్వం ఉంది. బావ కొడుకు, అన్న అల్లుడు, తిరుమలశెట్టి వారింటికి గర్రె వారి అమ్మాయిని కోడలిగా పంపడం.. ఇలా అందరూ బీరకాయపీచు బంధువులే. మృతుల్లోని పడాల దుర్గాప్రసాద్, పడాల దేవదత్తసాయి వరుసకు అన్నదమ్ములు. అదే విధంగా మృతుల తల్లిదండ్రులు అందరూ రోజువారీ కూలి పని లేదా చిన్న రైతులుగా ఉంటూ పిల్లలను చదివించుకుంటున్నారు. తిరుమలశెట్టి పవన్ డిగ్రీ మొదటి ఏడాది, అనిశెట్టి పవన్ గణేశ్ పాలిటెక్నిక్ మూడో ఏడాది, మిగతా ముగ్గురు ఇంటర్ చదువుతున్నారు. పవన్ గణేశ్ తండ్రి నాలుగేళ్ల కిందట మరణించగా తల్లి రామలక్ష్మి తాళ్లపూడిలోని ఓ కళాశాలలో చిన్న ఉద్యోగం చేసుకుంటూ పవన్‌తోపాటు కూతురు దివ్యనూ చదివిస్తున్నారు. పవన్ మృత్యువాత పడడంతో ఆమెను సముదాయించడం ఎవరి తరం కాలేదు.


నాలుగు గంటల్లో వెలికితీత

సమాచారం తెలిసిన వెంటనే కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహకిషోర్ యంత్రాంగాన్ని అప్రమత్తంచేశారు. దీంతో చీఫ్ ఫైర్ ఆఫీసర్ మార్టిన్ లూథర్‌కింగ్, ఆర్డీవో రాణీ సుస్మిత, డీఎస్పీ దేవకుమార్, కొవ్వూరు రూరల్ సీఐ విజయబాబు ఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. పది మంది గజఈతగాళ్లు, ఆరుగురు ఎస్డీఆర్ఎఫ్, ఆరుగురు ఫైర్ సిబ్బంది గాలింపు చేపట్టారు. గాలింపు 8.30 గంటల సమయంలో చేపట్టగా 12.30 గంటలకు చివరి మృతదేహాన్ని వెలికితీశారు. కొవ్వూరు ఫైర్‌మెన్ ఎం.ప్రకాశ్‌బాబు డైవింగ్ సూట్ వేసుకొని నదిలో బాగా లోతుకు వెళ్లారు.

వైసీపీ చేసిన పాపం

తాడిపూడిలో ప్రమాదం జరిగిన ప్రాంతంలో ఇసుక ర్యాంపు ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అనుమతులతో పనిలేకుండా ఇష్టానుసారం డ్రెడ్జింగ్ చేశారు. ఈ క్రమంలోనే ఇప్పుడు ప్రమాదం జరిగిన ప్రదేశంలో కూడా నదిలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతుల్లోనే ఇప్పుడు యువకులు మృత్యువాతపడ్డారు. ఐదో మృతదేహం జాడ 20 అడుగుల లోతులో దొరకడం గమనార్హం. ప్రస్తుతం ఈ గోతులకు పక్కన ఇసుక వెలికితీస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ఇంత ప్రమాదకరమైన గోతులున్నా హెచ్చరికల బోర్డులు లేకపోవడం మరీ దారుణం.

సర్వం సిద్ధం!



పట్టభద్రుల నియోజకవర్గంలో నేడే పోలింగ్

ఉమ్మడి ఉభయగోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ నేడు జరగనుంది. అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అన్నింటిపై అవగాహన కలిగిన పట్టభద్రులే ఓటర్లుగా ఉన్నప్పటికీ ఎన్నికల అధికారులు మాత్రం ముందస్తుగా ఓటర్లకు సూచనలు చేశారు. పోలింగ్ ప్రశాంతంగా సాగేలా ముందుచూపు ప్రదర్శించారు. ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా బందోబస్తు ఏర్పాటుచేశారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలిస్తారు.

- బ్యాలెట్ పత్రాలు.. బ్యాలెట్ బాక్సుల వినియోగం
- ఉదయం 8 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్
- గుర్తింపు కార్డులు ఉంటేనే ఓటు వేసేందుకు అనుమతి
- స్వేచ్ఛగా ఓటేయండి.. ఆర్వో కలెక్టర్ వెట్రిసెల్వి

(ఏలూరు/అమలాపురం ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి ఉభయగోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు వీలుగా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నియోజకవర్గంలో 3 లక్షల 14 వేల 984 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఒక్క ఏలూరు జిల్లాలోనే 42 వేల 282 మంది ఓటర్లు ఉండగా, వీరి కోసం 66 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ ఆరంభమై సాయంత్రం నాలుగు గంటలతో ముగియనుంది. పోలింగ్ శాతాన్ని పర్యవేక్షిం చేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు వెలువడ్డాయి. వాస్తవానికి ఉభయగోదావరి జిల్లాలో పట్టభద్రులైన ఓటర్లు 3 లక్షల 14 వేల 984 మంది ఉండగా వీరి నిమిత్తం 456 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. పోలింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు వెబ్ కాస్టింగ్ సిద్ధం చేశారు. ఎన్నికలకు సంబంధించి 35 మంది పోటీలో ఉన్నారు. ఎన్నికల నిర్వహణ సాఫీగా సాగేలా 545 మంది ప్రిసైడింగ్ అధికారులు, 545 అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 1080 మంది ఇతర పోలింగ్ సిబ్బంది, 544 మంది మైక్రో అబ్జర్వర్లతో కలిపి మొత్తం మీద రెండు వేల 714 మంది ఎన్నికల సిబ్బందిని నియమించారు. ఏలూరు జిల్లాకు సంబంధించి 80 మంది పీవో, మరో 80 మంది ఏపీవో, 160 మంది అదనపు సిబ్బంది, 80 మంది అబ్జర్వర్లతో కలిపి మొత్తం మీద 400 మందిని నియమించారు. 70 మంది జోనల్ అధికారులను, 99 మంది రూట్ ఆఫీసర్లను నియమించారు. ఎమ్మెల్సీ ఓటింగ్‌కు సంబంధించి 1199 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. గురువారం పోలింగ్ జరగనుండడంతో జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వి బుధవారం అధికారులతో సమీక్షించారు. ఎక్కడాలోపం జరగకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులకు సూచించారు. తగు నివేదికలను సిద్ధం చేసుకోవాలని నిర్దిష్ట ఆదేశాలు జారీ అయ్యాయి. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని వెట్రిసెల్వి పిలుపునిచ్చారు.

అంతా టెన్షన్.. టెన్షన్

మూడు నెలలుగా ప్రత్యక్ష, పరోక్ష పద్ధతిలో ప్రచారం నిర్వహించిన అభ్యర్థులంతా గురువారం తమ అదృష్టాన్ని పరిశీలించుకోబోతున్నారు. పోటీ పడుతున్న అభ్యర్థుల సంఖ్య భారీగా ఉండడమే కాకుండా ఈసారి ఓటర్ల సంఖ్య ఇదే మాదిరిగా పెరిగింది. ఇప్పుడున్న పరిస్థితుల అనుకూలతను బట్టి సుమారు 70 శాతం వరకు పోలింగ్ నమోదయ్యే అవకాశాలు లేకపోలేదని అధికారులు అంచనా వేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి పట్టభద్రుల ఓటర్లను ఒక చోటుకు రప్పించడం అంత సులువైన పనికాదని, ఈ కారణంగానే పోలింగ్ మందకొడిగా సాగడంతోపాటు శాతం తగ్గుముఖం పట్టగలదని ఇంకొంతమంది అభ్యర్థులు అంచనా వేస్తున్నారు. ప్రధానంగా తెలుగుదేశం పక్షాన పేరాబత్తుల రాజశేఖరం పోటీలో ఉండడంతో ఆయనకు అనుకూలతలు, బలహీనతలపైనే ఇప్పటివరకు ఎవరంతట వారుగా అంచనాలు వేశారు. తెలుగుదేశం మాత్రం తమ పార్టీ అభ్యర్థి భారీ మెజారిటీతో గెలుపొందుతారని ఇప్పటికే అంచనా వేసింది. ఇంకోవైపు పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు సైతం టీడీపీ అభ్యర్థికి గట్టి పోటీని ఇచ్చారు. ప్రచారంలోను ఏ మాత్రం తగ్గకుండా ముందుకే సాగారు. మిగిలిన అభ్యర్థులు నువ్వా నేనా అనే తరుణంలో ప్రచారాస్త్రాలు సంధించారు. పోటీలో ఉన్న అభ్యర్థులందరి వాదనలు విన్న పట్టభద్రుల ఓటర్లు ఏవైపు మొగ్గు చూపుతారనేదే ఇప్పుడు అందరిలోను టెన్షన్.. టెన్షన్.



అమలాపురం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల సరంజామాతో సిద్ధమైన పోలింగ్ సిబ్బంది

మొత్తం అభ్యర్థులు : 35
ఓటర్లు : 3,14,984

బరిలో నిలిచింది వీరే..

పేరాబత్తుల రాజశేఖరం, కాట్రు నాగబాబు, షేక్ హుసేన్, కట్టా వేణుగోపాలకృష్ణ, కాండ్రేగుల నరసింహం, కాశ్లారి కృష్ణమోహన్, కుక్కల గోవిందరాజు, కునుకు హేమాకుమారి, కైలా లావణ్య, గౌతంబాబు కొల్లు, చిక్కాల దుర్గారావు, తాశ్లారి రమేష్, దత్తాత్రేయ నోరి, దిడ్ల వీర రాఘవులు, దొరబాబు యాళ్ల, నీతిపూడి సత్యనారాయణ, పినిపే నాగభూషణవర్మ, పిప్పళ్ల సుప్రజ, పేపకాయల రాజేంద్ర, బొడ్డు శ్రీనివాసరావు, బొమ్మనబోయిన వీఎస్ఆర్ మూర్తి, బొమ్మిడి సన్నిరాజ్, బండారు రామ్మోహన్‌రావు, భీమేశ్వరరావు చిక్కా, మాకే దేవిప్రసాద్, మెర్ల శాస్త్రులు, మోకన అంబేడ్కర్, రాజపూడి, జేటీ రామారావు, రేవులగడ్డ ముఖేష్ బాబు, వానపల్లి శివగణేష్, ఎం.శ్రీనివాసరావు, శ్రీనివాస్ విష్ణువజ్ఝల, జీవీ సుందర్, హసన్ షరీఫ్.



కాకినాడ మెక్లారిన్ హైస్కూల్ ఆవరణలో బుధవారం ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజీలో పోలింగ్ సామగ్రి పంపిణీపై ఆరా తీస్తున్న తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

ఓటు వేసేందుకు వెళుతున్నారా..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించే వారంతా ఈ జాగ్రత్తలు పాటించాలి. ఎన్నికల కమిషన్ నిర్దేశించినట్లు తగిన గుర్తింపు కార్డులను అందుబాటులో ఉంచుకుని పోలింగ్ సమయంలో అధికారుల ఎదుట ప్రదర్శించాలి. ఆధార్ కార్డు, పాన్‌కార్డు, దివ్యాంగుల సర్టిఫికెట్, ఓటరు గుర్తింపుకార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు, డిపార్టు మెంట్ గుర్తింపుకార్డు, జాతీయ ఉపాధి హామీ జాబ్‌కార్డు, బ్యాంకులు, తపాలశాఖలో జారీ చేసిన ఫొటోతో ఉన్న పాస్‌బుక్, పెన్షన్ డాక్యుమెంట్‌ను ప్రతీ ఓటరు కలిగి ఉండాలి. ముందస్తుగా ఈ తరహా కార్డులు ఉన్నాయో లేదో సరి చూసుకుని పోలింగ్ కేంద్రానికి వెళ్లాలి.

మీ ఓటు చెల్లాలంటే...

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు విధానం అందరూ అర్థం, అవగాహన చేసుకోవాలి. సాధారణ ఎన్నికలకు భిన్నంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేవలం బ్యాలెట్ పత్రాలను మాత్ర మే పోలింగ్‌లో వినియోగిస్తారు. ఓటర్లకు ఒక బ్యాలెట్ పత్రాన్ని అందిస్తారు. ఈ పత్రంలో అభ్యర్థుల పేర్లు, ఫొటోలు ఉంటాయి. ఎన్నికల అధికారి ఇచ్చిన పెన్ మాత్రమే ఉపయో గించాలి. ప్రాధాన్యత క్రమంలో మీకు నచ్చిన అభ్యర్థి పేరు ఎదురుగా ఉన్న గడిలో 1 అని అంకెను వేయాలి. ఆ తర్వాత ఇష్టమైన వారికి 2, 3, 4 ఈ తరహాలో ఓటు వేయవచ్చు. ఎట్టి పరిస్థితుల్లో ఒకే అంకెను(నెంబర్) ఇద్దరికి వేయకూడదు. అలా వేస్తే మీ ఓటు చెల్లదు. మరో ముఖ్య విషయమేమిటంటే బ్యాలెట్ పత్రంలో ఇష్టమైన అభ్యర్థికి 1 అంకె వేయకుండా ఆ తదుపరి 2, 3, 4 ప్రాధాన్యత క్రమంలో ఓటు వేస్తే అదీ కూడా చెల్లదు. బ్యాలెట్ పేపర్‌లో అంకెలు మాత్రం వేయాలి.

వీరేశ్వరునికి సువర్ణ నాగాభరణం బహూకరణ

- వార్త 7లో

నేడు ముమ్మిడివరంలో బాలయోగీశ్వరుల తీర్థం



ముమ్మిడివరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): శివరాత్రి వచ్చిందంటే గుర్తుకు వచ్చేది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో జరిగే శ్రీ భగవాన్ బాలయోగీశ్వరుల తీర్థం. భగవాన్ బాలయోగీశ్వరులు 40 ఏళ్ల పాటు కఠోర తపస్సు చేశారు. శివరాత్రి మరునాడు భక్తులకు బాలయోగీశ్వరులు దర్శనం ఇచ్చేవారు. బాలయోగీశ్వరులు కైవల్య సిద్ధి పొందిన తర్వాత కూడా భక్తులు బాలయోగీశ్వరుల సమాధులను దర్శించుకుంటున్నారు. ఈ నెల26, 27 తేదీల్లో భగవాన్ బాలయోగీశ్వరుల తపో ఆశ్రమంలో మహాశివరాత్రి మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. తపో ఆశ్రమ కమిటీ వారు మహాశివరాత్రి మహోత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు సుప్రభాత సేవ, బాలయోగీశ్వరులకు అభిషేకం, అర్చన, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాలు, 27న తెల్లవారుజామున 4 గంటల నుంచి అర్ధరాత్రి 12గంటల వరకు భగవాన్ బాలయోగీశ్వరుల దర్శనం, తీర్థం వంటి కార్యక్రమాలు జరగనున్నాయి.

రేపటి నుంచి విజ్ఞానశాస్త్ర సంబరాలు

అమలాపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి, జిల్లా విద్యాశాఖ సమగ్రశిక్ష ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా విజ్ఞాన శాస్త్ర సంబరాలు-2025 నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్కే సలీంబాషా తెలిపారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటు సంబరాలు నిర్వహిస్తామన్నారు. తొలిరోజున విద్యార్థులకు చింతనలంక జడ్పీహెచ్ఎస్, పల్లం జడ్పీ హెచ్ఎస్‌లలో వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తామన్నారు. కపిలేశ్వరపురం మండలం మాచర జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపవరింగ్ ఇండియన్ యూత్ ఫర్ గ్లోబల్ లీడర్‌షిప్ ఇన్ సైన్స్ అండ్ ఇన్నోవేషన్ ఫర్ వికసిత్ భారత్ అనే అంశంపై విద్యార్థులకు సెమినార్ నిర్వహిస్తామన్నారు. జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థుల సైన్స్ ప్రదర్శనతో పాటు క్విజ్ విజేతలకు నగదు పురస్కారాలు అందజేస్తామన్నారు. జిల్లా సైన్స్ అధికారి గిరిజాల వీఎస్ సుబ్రహ్మణ్యం సమన్వయకర్తగా వ్యవహరిస్తారన్నారు.

హరోంహర


పిఠాపురం పాదగయలో కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం

పిఠాపురం

పిఠాపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా పిఠాపురం పట్టణం భక్తజన సంద్రమైంది. పాదగయ క్షేత్రానికి తరలివచ్చే రహదారులన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. పుష్కరిణిలో స్నానాలు ఆచరించేందుకు మంగళవారం అర్ధరాత్రి నుంచే భక్తులు బారులు తీరారు. తెల్లవారు జాము సమయానికే పాదగయ బయట కిలో మీటరు మేర భక్తులు వున్నారు. స్వయంభూ కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించిన రాజరాజేశ్వరీ దేవి, అష్టాదశ శక్తిపీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్ఠాన దేవతైన పురుహూతికా అమ్మవార్లను, ఇతర ఉపాలయాలను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంట నుంచి కుక్కుటేశ్వర స్వామి భక్తులకు నిజ రూపంలో దర్శనమిచ్చారు. కుక్కుటేశ్వర స్వామికి లక్ష బిల్వార్చన, రాజ రాజేశ్వరీదేవికి లక్ష కుంకుమార్చన జరిపారు. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ప్రసాదరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాకినాడ ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. వైద్య శిబిరాల్లో అస్వస్థతకు గురైన పలువురికి వైద్య సేవలు అందించారు. పట్టణంలోని ఉమాసోమేశ్వర స్వామి, సకలేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.

కోటిపల్లి

కె.గంగవరం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కోటిపల్లి పుణ్యక్షేత్రం శివనామస్మరణతో మార్మోగింది. వేకువజామున గోదావరి నుంచి తీర్థపు బిందె తీసుకువచ్చి స్వామివారికి బాలభోగం నివేదించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి ఛాయాసోమేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఉదయం ప్రారంభమైన భక్తుల రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది. ఆలయంలో చాగంటి వంశీయులు నాలుగు తరాలుగా నిర్వహిస్తున్న అఖండ దీపారాధనను కొనసాగించారు. ఉత్సవ కమిటీ చైర్మన్, రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల, ఉత్సవ ప్రత్యేకాధికారి నల్లం చక్రధరరావు, ఆలయ తనిఖీ అధికారి బాలాజీరామ్‌ప్రసాద్, ఈవో భీమశంకరం స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు అందుతున్న సౌకర్యాలను వారు పర్యవేక్షించారు. మాన్సాస్ ట్రస్టు కార్యాలయం వద్ద అన్నదానాన్ని ఉత్సవ ప్రత్యేకాధికారి నల్లం చక్రధరరావు ప్రారంభించారు. ఆర్యవైశ్య సంఘం, కాకతీయ సంఘం, శాలివాహన సంఘం, ఫైండా వారి అన్నసత్రంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు అన్నదానాలు నిర్వహించాయి. రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.


సోమేశ్వరస్వామికి పంచామృతాభిషేకం


రాజమహేంద్రవరం గోదావరి తీరంలో భక్తుల పుణ్యస్నానాలు



గోదావరిలో రెండు లక్షల మంది పుణ్యస్నానాలు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం గోదావరి తీరం శివ నామస్మరణతో మార్మోగింది. బుధవారం తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు గోదావరి రేవులకు చేరుకుని హర హర మహాదేవ శంభో శంకర, నమశ్శివాయ అంటూ పుణ్యస్నానాలు చేశారు. కోటిలింగాల రేవు, చింతాలమ్మ ఘాట్, పద్మావతి ఘాట్, పుష్కరాల రేవు, మార్కండేయ ఘాట్, టీటీడీ ఘాట్, దోబీ ఘాట్, సరస్వతి ఘాట్, గౌతమి ఘాట్‌లు భక్తులతో కిక్కిరిశాయి. సుమారు రెండు లక్షల మంది స్నానాలు ఆచరించారు. మహిళలు కుటుంబీకులతో కలిసి స్నానాలు చేసి గోదావరమ్మకు పసుపు, కుంకుమ సమర్పించారు. ఉమాకోటిలింగేశ్వరాలయం, ఉమా మార్కండేశ్వరాలయం, కాశీవిశ్వేశ్వరాలయం, ఉమారామలింగేశ్వరాలయం, సర్వేశ్వరాలయం, సారంగధరేశ్వరాలయం, ఉజ్జయిని మహాకాళేశ్వరాలయం, కల్యాణి సమేత సోమ లింగేశ్వరాలయం, బసవ లింగేశ్వరాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పేర్గాంచిన ఉమాకోటిలింగేశ్వర క్షేత్రంలో రథోత్సవం కనుల పండువగా సాగింది. భక్తులు రథాన్ని లాగుతూ స్వామి, అమ్మవార్లను తిలకిస్తూ భక్తిపారవశ్యం చెందారు.


ద్రాక్షారామలో భీమేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

ద్రాక్షారామ

ద్రాక్షారామ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రమైన ద్రాక్షారామ భీమేశ్వరాలయం భక్త జనసంద్రమైంది. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే భక్తుల రాక మొదలుకాగా పది గంటలకు తీవ్ర రద్దీ నెలకొంది. వేలాది మంది క్యూలైన్లలో బారులు తీరి భీమేశ్వరస్వామిని, మాణిక్యాంబ అమ్మవారినిదర్శించుకుని అభిషేకాలు నిర్వహించారు. శీఘ్ర, విశిష్ట దర్శనాలకే 3-5 గంటల సమయం పట్టింది. రాత్రి 8 గంటల వరకు స్వామివారికి అభిషేకాలు జరిగాయి. 8.30 గంటలకు దేవస్థానం ఆధ్వర్యంలో భీమేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్షపత్రి పూజ నిర్వహించారు. 12 గంటలకు మహా నివేదన చెల్లించారు. రాత్రి 1.30 గంటల వరకు భక్తులు దర్శించుకున్నారు. చండీ హోమ పండితుడు ఇంద్రగంటి రామారావుశర్మ ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన జరిగింది. ఉత్సవ అధికారి, దేవదాయ శాఖ ఉప కమిషనరు డీఎల్వీ రమేష్‌బాబు పర్యవేక్షణలో, ఈవో అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, ఇతర ఆలయాల సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు భక్తులకు సేవలు అందించారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ తెల్లవారుజామున ప్రథమ అభిషేకం, దధీసేవలో పాల్గొన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దంపతులు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దంపతులు, టెక్నికల్ ఐజీ శ్రీకాంత్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

సామర్లకోట

సామర్లకోట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. మూలవిరాట్‌కు తెల్లవారుజాము నుంచీ ఆలయ పండితుల వేదమంత్రోచ్చారణలతో విశేష అభిషేకాలు జరిపారు. ఎండ ఎక్కువగా ఉన్నప్పటికీ భక్తులు క్యూలైన్లలో నిలుచుని భీమేశ్వరస్వామిని, బాలాత్రిపురసుందరి అమ్మవారిని దర్శించుకున్నారు. బందోబస్తు ఏర్పాట్లపై కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్, అదనపు ఎస్పీ సమీక్షించారు. కోనేరు, గోదావరి, మాండవ్యనారాయణస్వామి ఆలయ పుష్కరిణిల వద్ద తెల్లవారుజామున మూడు గంటల నుంచే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. కెనాల్ రోడ్డు పొడవునా వాహనాలు, కార్లు పార్కింగ్ చేయడంతో పలుమార్లు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ తలాటం సూర్యనారాయణ, ఈవో నీలకంఠం ఎప్పటికప్పుడు క్యూలైన్లను పర్యవేక్షించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. భీమేశ్వరుణ్ణి పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), పెద్దాపురం ఆర్డీవో ఎస్.మల్లిబాబు దంపతులు, తహసీల్దారు కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, దేవదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనరు సుబ్బారావు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.


ప్రత్యేక అలంకరణలో కుమారరామ భీమేశ్వరస్వామి


ఆదియోగి విగ్రహం లోపలి భాగంలో ప్రతిష్ఠించిన శివలింగం

ఆదియోగి విగ్రహావిష్కరణ

మండపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఆదియోగి తొలి భారీ విగ్రహాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడిలో మహా శివరాత్రి పర్వదినాన అశేష భక్తజనం, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య బుధవారం ఉదయం అట్టహాసంగా ప్రారంభించారు. ఆంధ్ర శబరిమల ఆలయ వ్యవస్థాపకుడు ఎస్ఎల్ కనకరాజు గురుస్వామి నేతృత్వంలో స్వామివారికి విశేష పూజలు జరిపారు. ఆదియోగి విగ్రహం లోపలి భాగంలో శివలింగాన్ని ప్రతిష్ఠించారు. అయోధ్య బాలరాముడు, వారాహిమాత విగ్రహాలను కూడా ఆవిష్కరించారు. ఆదియోగి విగ్రహాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, స్థానిక నాయకులు, పలువురు రాజకీయ ప్రముఖులు, భారీ సంఖ్యలో ప్రజలు దర్శించుకున్నారు.


వారాహి మాత విగ్రహం

తాడిపూడి.. శోకసంద్రం!

- తల్లడిల్లిపోయిన కుటుంబ సభ్యులు
- అందరూ చిన్నరైతుల బిడ్డలే


సంఘటనా స్థలంలో బాధతో రోధిస్తున్న మృతుల కుటుంబసభ్యులు


యువకులతో మాట్లాడుతున్న తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి, ఆర్డీవో రాణీసుస్మిత

తాళ్లపూడి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తాడిపూడికి చెందిన ఐదుగురు మిత్రుల జలసమాధితో గ్రామం యావత్తూ శోకసంద్రంలో మునిగిపోయింది. గోదావరి నదీ తీరంలో కన్న బిడ్డలను పోగొట్టుకున్న కుటుంబాల వారి ఆర్తనాదాలతో, వారి బంధువుల ఓదార్పులతో తల్లడిల్లింది. చనిపోయిన వారి మృతదేహాలను వెతికే సమయంలో జిల్లా కలెక్టరు ప్రశాంతి అక్కడికి విచ్చేసి బాధిత కుటుంబాల వారిని కలిసి పరామర్శించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు విచ్చేసి ఆయా కుటుంబాల వారిని ఓదార్చారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి న్యాయం జరిగేలా అన్నివిధాలా కృషి చేస్తామన్నారు. కాగా మృతుల్లో పడాల సాయి తండ్రి పడాల రాము మాట్లాడుతూ తనకు ఉన్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయం చేస్తానని, కొడుకు, కూతురు ఉన్నారని... ఉన్న ఒక్క కొడుకూ చదివి కుటుంబానికి ఆధారంగా ఉంటాడని అనుకుంటే ఇలా అయిపోయిందని రోధించాడు. మరో మృతుడు పడాల దుర్గాప్రసాద్ తండ్రి పడాల వెంకన్నదొర మాట్లాడుతూ తాను వ్యవసాయం చేస్తానని, తన ఇద్దరు కొడుకుల్లో పెద్ద కొడుకు ప్రసాద్ ఐటీఐ చదువుతున్నాడని, చదువు అనంతరం పెద్ద దిక్కుగా ఉంటాడనుకుంటే ఇలా జరిగిం దని వాపోయాడు. గర్రే ఆకాష్ తండ్రి సీతారాముడు మాట్లాడుతూ తాను వ్యవసాయం చేస్తానని, తనకు ఇద్దరు కొడుకుల్లో పెద్ద కొడుకు ఆకాష్ ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నాడని, పెద్ద చదువులు చదివి, తమ కుటుంబాన్ని ఆదుకుంటాడనుకుంటే ఘోరం జరిగిపోయిందని విలపించాడు. అనిశెట్టి పవన్ తాత కామిశెట్టి పోసియ్య మాట్లాడుతూ తను వ్యవసాయ కూలీగా జీవిస్తున్నానని, తన అల్లుడు మరణానంతరం తన కూతురు, మనుమడు తన దగ్గరే ఉంటున్నారని, తన కూతురు తాళ్లపూడిలో ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తుండగా, ఆమెకు ఉన్న ఒక్క కొడుకూ కానరాని లోకాలకు వెళ్లిపోయాడని కన్నీరుమున్నీరయ్యాడు. తిరుమలశెట్టి పవన్ తండ్రి చిన రంగయ్య మాట్లాడుతూ ఉన్న కొద్దిపాటి పొలంతో పాటు తాను కౌలుకు వ్యవసాయం చేస్తున్నానని, కొడుకు మంచిగా చదివి పెద్ద ఉద్యోగం చేస్తాడనుకుంటే కడతేరిపోయాడంటూ విలపించాడు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం: మంత్రి దుర్గేష్

కొవ్వూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తాడిపూడిలో గోదావరి స్నానానికి వెళ్లి ఐదుగురు యువకులు మృతి చెందిన సంఘటనపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. యువకుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర మృతదేహాలను సందర్శించారు. బంధువుల నుంచి ప్రమాదానికి గల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాలకు త్వరితగతిన పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎం.పద్మశ్రీరాణి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.సాయికిరణ్‌ను మంత్రి ఆదేశించారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రమాద సంఘటనను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలతోపాటు సీఎంవో దృష్టికి తీసుకువెళ్లామన్నారు. మృతిచెందిన యువకులు జనసేన సభ్యత్వం కలిగి ఉన్నారని తెలిసిందని, పార్టీ సభ్యత్వం ఉన్నట్టు యితే రూ.5 లక్షలు ప్రమాదబీమా వస్తుందన్నారు. కాగా శవ పంచనామా పూర్తయ్యేవరకు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆసుపత్రిలో ఉండిపోయారు. సెలవుదినం అయినప్పటికీ ప్రభుత్వాసుపత్రిలోని వైద్యులు అందరూ అందుబాటులో ఉండి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు.


కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే ముప్పిడి

సహాయం అందేలా చూస్తాం

ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి మండలం తాడిపూడి ఇసుక ర్యాంపు వద్ద స్నానానికి దిగి ఐదుగురు యువకులు మృతిచెందిన ఘటన బాధాకరమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ ఘటనపై కలెక్టర్ ప్రశాంతితో ఫోన్‌లో ఆరా తీశారు. తక్షణం సహాయక చర్యలు చేపట్టాలని, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. సీఎం చంద్రబాబు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి బాధిత కుటుంబాలకు సాయం అందేలా చూస్తామన్నారు.

హుషారుగా హాకీ...

12వ రోజుకు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్


టోర్నమెంట్‌లో తలపడుతున్న క్రీడాకారులు

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ బుధవారం 12వ రోజు హుషారుగా సాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రాష్ట్రాల పురుషుల జట్లకు సంబంధించి మొత్తం 3 మ్యాచ్‌లు జరిగాయి. సెంట్రల్ సెక్రటేరియట్, ఆర్ఎస్బీ కన్పూర్ పురుషుల క్వాటర్ ఫైనల్ మ్యాచ్‌లో సెంట్రల్ సెక్రటేరియట్ 3-1 తేడాతో విజయం సాధించింది. హర్యానా సెక్రటేరియట్, మహారాష్ట్ర సెక్రటేరియట్ పురుషుల జట్ల మధ్య జరిగిన క్వాటర్ ఫైనల్ మ్యాచ్‌లో హర్యానా సెక్రటేరియట్ 7-1 తేడాతో విజయం సాధించింది. ఒడిస్సా సెక్రటేరియట్, ఛత్తీస్‌ఘడ్ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన క్వాటర్ ఫైనల్ మ్యాచ్‌లో ఒడిస్సా సెక్రటేరియట్ 4-1 తేడాతో విజయం సాధించింది. డీఎస్‌డీవో శ్రీనివాస్‌కుమార్, హాకీ కోచ్ రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

వీరేశ్వరునికి సువర్ణ నాగాభరణం బహూకరణ


నాగాభరణం సమర్పిస్తున్న నాగేంద్రరావు

ఐ.పోలవరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ళ భద్రకాళీసమేతవీరేశ్వరస్వామికి చెయ్యేరుకు చెందిన త్సవటపల్లి నాగేంద్రరావు 313 గ్రాములు బరువు రూ.25లక్షల విలువైన సువర్ణ నాగాభరణం బహూకరించారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సమక్షంలో నాగేంద్రరావు, అనంత లక్ష్మీసత్యవతీదేవి దంపతులు స్వామికి నాగాభరణం సమర్పించారు. సంప్రోక్షణ అనంతరం ఆలయ అర్చకులు నాగాభరణాన్ని స్వామికి అలంకరించారు. కార్యక్రమంలో ఏసీ మాచిరాజు లక్ష్మీనారాయణ, తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు, నడింపల్లి సూర్యవర్మ, దాట్ల రామకృష్ణంరాజు, దాట్ల ఇంద్రరాజు, కాకర్లపూడి రాజేష్, సాగిరాజు సూరిబాబురాజు, కటారి నాని, సూపరింటెండెంట్ కటారి శ్రీనివాసరాజు ఉన్నారు.

పాదగయ దర్శనానికి వెళ్తుండగా ప్రమాదం

ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీకొన్న ఆటో

ఒకరి మృతి, మరో ఆరుగురికి తీవ్ర గాయాలు

గొల్లప్రోలు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు బైపాస్‌రోడ్డులో బుధవారం జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించగా, మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. మహాశివరాత్రి సందర్భంగా అన్నవరం నుంచి పిఠాపురం పాదగయ క్షేత్రానికి దర్శనం నిమిత్తం ఆటోలో తొమ్మిది మంది ప్రయాణికులు బయలుదేరారు. గొల్లప్రోలు బైపాస్ రోడ్డులో బి.ప్రత్తిపాడు జంక్షన్ సమీపంలోకి వచ్చేసరికి రోడ్డు పక్కన ఆగి ఉన్న పార్సిల్ వ్యాన్‌ను ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తొండంగి మండలం గోపాలపట్టణం గ్రామానికి చెందిన బెక్కం నాగేశ్వరరావు (50), అతడి తల్లి మంగాయమ్మను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ నాగేశ్వరరావు మరణించాడు. తీవ్రంగా గాయపడిన అన్నవరం గ్రామానికి చెందిన ఎర్రమిల్లి అఖిలేష్, రాజు, భాగ్యలక్ష్మి విశాఖ ఎస్ఆర్ఐ ఆసుపత్రిలో, బొండు సత్యవతి పిఠాపురం ప్రభుత్వాసుపత్రి, శృంగవృక్షం గ్రామానికి చెందిన అమృతి చంద్రరావు కాకినాడ మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చంద్రరావు అపస్మారక స్థితిలో ఉన్నాడు. ఆటో డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు.


ప్రమాదంలో మరణించిన నాగేశ్వరరావు

పట్టిసీమకు వెళ్తుండగా..!

ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి

ఐదుగురికి స్వల్పగాయాలు

కొవ్వూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లికి చెందిన తూము రమణతో పాటు మరో ఐదుగురు పట్టిసీమ బయలుదేరారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం చిడిపి గ్రామంలోని గోదావరి ఏటిగట్టు రోడ్‌లో ప్రమాదవశాత్తు ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తూము రమణ (40) గొంతులో ఇనుప ఊచ దిగిపోవడంతో తీవ్ర రక్త గాయమైంది. చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్టు ధ్రువీకరించారు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న మరో ఐదుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలిసిన వెంటనే తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ ప్రభుత్వా సుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహానికి కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ హెడ్ కానిస్టేబుల్ భగవాన్‌దాస్ చెప్పారు.


బోల్తాపడిన ఆటో


మరణించిన రమణ (ఫైల్)

తాళం వేసి ఉన్న ఇంట్లో బంగారం, నగదు చోరీ

రావులపాలెం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చొరబడి బంగారం ఆభరణాలు, నగదు అపహరించుకుపోయిన ఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం లక్ష్మీపోలవరం గ్రామంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..... లక్ష్మీపోలవరానికి చెందిన దేవగుప్తపు శ్రీనివాసన్ ఈనెల 22న పశ్చిమగోదావరి జిల్లా గణపవరం మండలం ముప్పర్తిపాడులో జరిగే అమ్మవారి జాతరకు ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి వెళ్లాడు. తిరిగి 25న రాత్రి ఇంటికి వచ్చేసరికి తలుపులు పగలుగొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి అందులోని 30 కాసుల బంగారం ఆభరణాలు, రూ.1.70 లక్షలు నగదు చోరీకి గురైనట్టు గుర్తించారు. దీంతో రావులపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ ఎం.శేఖర్‌బాబు సిబ్బందితో సంఘటనా ప్రాంతానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. క్లూస్‌టీమ్ పరిశీలించి ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు

టీడీపీలోకి మరో వైసీపీ కౌన్సిలర్

తుని రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో వైసీపీకి దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. ఇప్పటికే 15మంది వైసీపీ మున్సిపల్ కౌన్సిలర్లు టీడీపీలో చేరగా తాజాగా మరొకరు సైకిల్ ఎక్కేశారు. ఒకటో వార్డు మహిళా కౌన్సిలర్ వారాధి జ్యోతి కుటుంబం సభ్యులతో కలిసి టీడీపీలో చేరారు. ఆమెకు మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు యినిగంటి సత్యనారాయణ, మోతుకూరి వెంకటేష్, దంతులూరి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.


యనమల సమక్షంలో టీడీపీలో చేరిన మున్సిపల్ కౌన్సిలర్ జ్యోతి

పేకాటశిబిరంపై పోలీసుల దాడి

అల్లవరం, ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి): బోడసకుర్రు దేవీసెంటర్‌లో వైసీపీనేత దాబాపై ఏర్పాటు చేసిన పేకాట శిబిరంపై పోలీసులు బుధవారం రాత్రి దాడిచేశారు. 12మంది అరెస్టుచేసి, రూ.30 వేలు, 3మోటారు సైకిళ్లు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులను చూసి ఒక వ్యక్తి దాబాపై నుంచి దూకేయడంతో గాయపడినట్టు తెలిసింది.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ముమ్మిడివరం,ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి):ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు మండలంలో పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎం.సుబ్బలక్ష్మి తెలిపారు. మండలంలో 3107ఓట్లు ఉండగా వీటిలో 1706 పురుషులు, 1401మహిళా ఓటర్లు ఉన్నారు.

శంభో శంకర భోళాశంకర

ఎన్నికల విధులు సరే.. ఓటు వేసేది ఎలా!

పోస్టల్ బ్యాలెట్ ఉన్నట్టా.. లేనట్టా



అమలాపురం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పోలింగ్ సిబ్బంది

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పోలింగ్ సిబ్బంది వారికి నిర్దేశించిన పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. ఎన్నికల విధి నిర్వహణలో ఉన్న పోలింగ్ సిబ్బంది ఓటు హక్కును ఏవిధంగా వినియోగించుకోవాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఫారం-12 పూర్తిచేసి నిర్దేశిత గడువులో అందజేసిన వారికి పోస్టు ద్వారా వారి చిరునామాలకు పోస్టల్ బ్యాలెట్ పంపిస్తామని అధికారికంగా ప్రకటించారు. ఈమేరకు రిటర్నింగ్ అధికారి ఉత్తర్వులు సైతం జారీ చేశారు. ఎన్నికల సిబ్బంది ఇప్పటికే విధి నిర్వహణలో భాగంగా ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఇప్పటి వరకు ఏఒక్కరికీ పోస్టల్ బ్యాలెట్ అందలేదు. దాంతో తాము ఓటు హక్కును కోల్పోయినట్టేనా అని ఆవేదన వ్యక్తంచేసేవారు ఎందరో ఉన్నారు. ఇటువంటి పరిస్థితి ఎదురవుతుందని గుర్తించే కనీసం ఓటరుగా కూడా నమోదు కాలేదని ఎన్నికల విధులకు హాజరైన కొందరు సిబ్బంది పేర్కొనడం విశేషం. పోస్టల్ బ్యాలెట్‌ను ఏవిధంగా వినియోగించుకోవాలో ఉత్తర్వులు ఇచ్చిన ఎన్నికల అధికారులు పోస్టల్ బ్యాలెట్‌ను అందజేయని తీరు సర్వత్రా చర్చనీయాంశమైంది.

శివరాత్రి వేడుకలు

కాట్రేనికోన, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కుండలేశ్వరానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. గోదావరిలో స్నానాలాచరించి గోదావరి మాతకు పూజలు చేశారు.అనంతరం కుండలేశ్వరంలో పార్వతీకుండలేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ప్రధాన అర్చకుడు కాళ్ళకూరి కామేశ్వరరావు పూజలు నిర్వహించారు. మగసానితిప్పలో కాలభైరవస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు.ఆటో యూనియన్ ఆధ్వర్యంలలో అన్నసమారాధన జరిగింది. మండలంలోని పలు గ్రామాల్లో మహాశివరాత్రి వేడుకలు నిర్వహించారు.

కనుల పండుగగా రథోత్సవం

మామిడికుదురు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మొగలికుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి రథోత్సవాన్ని భక్తులు బుధవారం కన్నుల పండుగగా నిర్వహించారు. మహాశివరాత్రి పురస్కరించుకుని మేళతాళాలు, భక్తుల కోలాహలం, బాణసంచా కాల్పుల మధ్య హరహరా అంటూ భక్తులు రథాన్ని లాగుతూ రథోత్సవాన్ని ఘనంగా జరిపారు. వివిధ రకాల పుష్పాలతో రథాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంపై వీరభద్రస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని అభిషేకాలు, మొక్కులు, ముడుపులు సమర్పించారు.

● మహాశివరాత్రి వేడుకలు
● ఆలయాల్లో అభిషేకాలు, పూజలు

అయినవిల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి పరమేశ్వరుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయం, ముక్తేశ్వరంలో శ్రీ ముక్తికాంత క్షణముక్తీశ్వరాలయం, శ్రీరాజరాజేశ్వరి సమేత ముక్తేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ముక్తేశ్వరంలో భక్తులు వృద్ధ గౌతమీ నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. తెల్లవారుజాము నుంచి స్వామివారి దర్శనం కోసం భక్తులు ఆలయాల వద్ద క్యూలైన్లలో బారులు తీరారు. ఆలయ సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవదాయశాఖ సిబ్బంది సేవలు అందించారు. అయినవిల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ముక్తేశ్వరం స్నాన ఘట్టాల వద్ద ఏర్పాట్లు చేశారు. తొగరపాయలో పితృ దేవతలకు పిండ ప్రదానాలు నిర్వహించారు. ముక్తేశ్వరస్వామివారికిమహాన్యాసాది రుద్రాభిషేక పూజలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. జ్యోతిర్లింగార్చన, ధూపోత్సవం, దీపాలంకరణ నిర్వహించారు.

గ్రామాల్లో దీపాలంకరణ

మలికిపురం, ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శివరాత్రిని ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచి స్వామివారికి అభిషేకాలు జరిపారు. కొన్నిగ్రామాల్లో శివరాత్రి సందర్భంగా తీర్థాలు నిర్వహించారు. ప్రతీ గ్రామంలో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం ప్రతీ గ్రామంలో దీపాలంకరణ వైభవంగా ఏర్పాటు చేశారు.

వీరేశ్వరునికి పుష్కర నదీజలాభిషేకం

ఐ.పోలవరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా వీరేశ్వరస్వామికి ద్వాదశ పుష్కర నదీ జలాభిషేకం వైభవంగా నిర్వహించారు. దేశంలో పుష్కరాలు జరిగే 12నదుల జలాలతో స్వామిని అభిషేకించారు. ఆలయ పురోహితుడు నాగాభట్ల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ స్వామికి పుష్కర నదీ జలాభిషేకం శాస్త్రోక్తంగా జరిగింది. సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ, ఆలయ అర్చకులు యనమండ్ర సుబ్బారావు, యనమండ్ర సత్యసీతారామశర్మ, ఉండి దత్తుశర్మ, వేదపండితుడు గంటి సుబ్రహ్మణ్యశాస్త్రి, స్వస్తి వాచకుడు నాగాభట్ల రవిశర్మ పాల్గొన్నారు. మురమళ్ళ వీరేశ్వరస్వామి ఆలయం భక్తుల శివనామస్మరణతో పులకించింది. వేకువజాము నుంచే పవిత్ర గోదావరి నదిలోస్నానాలు ఆచరించిన భక్తులు వీరేశ్వరస్వామి దర్శనం కోసం బారులు తీరారు. వేలసంఖ్యలో భక్తులు పోటెత్తడంతో ఆలయం ఓంకార నాదంతో ప్రతిధ్వనించింది. భక్తులు స్వామికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు జరిపించుకున్నారు. దేవదాయశాఖ తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు శివరాత్రి ఉత్సవాలను పర్యవేక్షించారు. ఏర్పాట్లను ఏసీ మాచిరాజు లక్ష్మీనారాయణ, సూపరింటెండెంట్ కటారి శ్రీనివాసరాజు పరిశీలించారు. కేశనకుర్రుపాలెం, బాణాపురం, టి.కొత్తపల్లి శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. భైరవపాలెంలో శివరాత్రి ఉత్సవాలు జరిగాయి. వీరేశ్వరస్వామిని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు దంపతులు, మాజీ ఎమ్మెల్యేలు పొన్నాడ వెంకటసతీష్‌కుమార్, చెల్లి వివేకానంద స్వామిని దర్శించుకున్నారు.






అయినవిల్లి: ముక్తేశ్వరంలో క్షణముక్తీశ్వరస్వామి, ఐ.పోలవరం: వీరేశ్వరస్వామికి పంచామృతాభిషేకం, లింగాకృతి, మామిడికుదురు:అప్పనపల్లిలో భారీ సెట్టింగ్

సహస్ర దీపాలంకరణ

పి.గన్నవరం, ఫిబ్రవరి26(ఆంధ్రజోతి): మండలంలోని శివాలయాలు శివనామశ్మరణతో మార్మోగాయి. పి.గన్నవరం గరుడేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామి దర్శనానికి పోటెత్తారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. కారుపల్లి శ్రీపార్వతిసోమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహిళలు వేసిన కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. బెల్లంపూడి, ఉడిమూడి, కుందాలపల్లి, నరేంద్రపురం, ముంగండ, మానేపల్లి, మొండెపులంక, వైకొత్తపల్లి, పోతవరం తదితర గ్రామాల శివాలయాల్లో భక్తులు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మానేపల్లి శ్రీఉమాఆనందేశ్వర స్వామి ఆలయంలో లింగోద్భవ అభిషేకం నిర్వహించారు. అనంతరం రాత్రి సహస్ర దీపాలంకరణ చేశారు.

సర్వేశ్వరునికి విశేష అభిషేకాలు

అమలాపురం టౌన్/రూరల్,ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం తెల్లవారుజాము నుంచి శివాలయాలన్నీ శివ పంచాక్షరీ మంత్ర జపంతో మార్మోగాయి. అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లోని శ్రీపార్వతీ సమేత సిద్ధేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి అఖండ దీపారాధన నిర్వహించారు. అమలాపురం కూచిమంచివారి అగ్రహారంలోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి విశేష అభిషేకాలు జరిగాయి. మండల పరిధిలోని నడిపూడి శ్రీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామివారి ఆలయంలో భక్తులు స్వయంగా గర్భగుడిలో శివలింగాన్ని తాకి ప్రత్యేక అభిషేకాలు జరిపించుకున్నారు. అమలాపురంలో పురాణ ప్రసిద్ధి నొందిన శ్రీభ్రమరాంబికా సమేత చెన్నమల్లేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెన్నమల్లేశ్వరా సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ, స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి అఖండ దీపారాధన జరిపించారు. రవణం వీధిలోని శ్రీసర్వమంగళ రామలింగేశ్వరస్వామి ఆలయంలో దేవస్థానం చైర్మన్ మాచిరాజు రవికుమార్, నాగవల్లి దంప తుల ఆధ్వర్యంలో స్వామివారికి విశేష అభిషేకాలు జరిపించారు. తెల్లవారుజాము నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. సమనస-రంగాపురంలోని శ్రీరాజరాజేశ్వరీ సమేత రామేశ్వర స్వామి ఆలయంలో రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు వెలవలపల్లి సత్యనారాయణ శర్మ ఆచార్య బ్రహ్మత్వంలో జరిగిన వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల పూజలు

రాజోలు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కడలిలో శ్రీకపోతేశ్వరస్వామి, బాలత్రిపురసుందరిదేవి అమ్మవారిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివకోటిలో శ్రీఉమాశివలింగేశ్వర స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు వడ్లమూడి ప్రకాష్, కడలి నీటి సంఘం అధ్యక్షుడు గాలిదేవర వెంకన్నబాబు, సోషల్ వర్కరు, న్యాయవాది యాలంగి రమేష్, ఎలుమర్తి రాము, కడలి మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శైవ క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిట

ముమ్మిడివరం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివనామస్మరణతో శైవ క్షేత్రాలు మార్మోగాయి. ఉదయాన్నే పవిత్ర గోదావరి నదీ జలాల్లో స్నానాలు ఆచరించి శివాలయాలకు వెళ్లి ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపించారు. దీంతో శైవ క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. శివనామస్మరణతో మార్మోగాయి. స్వామివారిని దర్శించుకుని, స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు జరిపించారు. ముమ్మిడివరంలో ఉమాసూరేశ్వరస్వామి, కొమనాపల్లి పార్వతీ సమేత చోడేశ్వర, లోకేశ్వరస్వామి, అయినాపురం శ్రీఉమాసోమేశ్వరస్వామి, అన్నంపల్లి పార్వతీ గౌతమేశ్వరస్వామి, కొత్తలంక ఉమాభోగేశ్వరస్వామి, క్రాపచింతలపూడి శ్రీఉమావల్లభేశ్వరస్వామి, ఠాణేలంక ఉమాసోమేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు జరిపించారు. ముమ్మిడివరం ఉమాసూరేశ్వరస్వామి ఆలయం వద్ద అయ్యప్ప సేవాసంఘం ఆధ్వర్యంలో భజనకార్యక్రమం, భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు. ముమ్మిడివరంలోని శ్రీభగవాన్ బాలయోగీశ్వరుల తపో ఆశ్రమంలో తెల్లవారుజామున 4గంటలకు సుప్రభాత సేవ, ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శివరాత్రిని పురస్కరించుకుని భగవాన్ పెదబాలయోగీశ్వరులు, చినబాలయోగీశ్వరుల తపో మందిరాన్ని పూలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పెదబాలయోగీశ్వరులు, చినబాలయోగీశ్వరులను దర్శించుకున్నారు.

భక్తులతో పోటెత్తిన శివాలయాలు

అంబాజీపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): బుధవారం మండలంలోని ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. తెల్లవారుజాము నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగలకుర్రు అగ్రహారం శివకేశవుల ఆలయంలో స్వామివార్కి రుద్రాభిషేకం, హోమం, పంచామృతాభిషేకాలు చేశారు. పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరంలో వేంచేసియున్న శ్రీబాలాత్రిపుర సుందరి వ్యాఘ్రేశ్వరస్వామి వార్కి ప్రత్యేక పూజలు చేపట్టారు. గంగలకుర్రు, మొసలపల్లి, వ్యాఘ్రేశ్వరం, మాచ వరం, పుల్లేటికుర్రు, ముక్కామల, నందంపూడి, ఇరుసుమండ, వక్కలంక గ్రామాల్లో స్వామివార్లకు పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద భక్తులు వివిధ రూపాలతో స్వామివార్ల ప్రతిమలను తయారుచేసి దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. మాచవరం పార్వతీ రాజేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

భక్తుల పుణ్యస్నానాలు

యానాం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): యానాంలో మహాశివారాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక శివాలయం ప్రాంగణంలోని శ్రీరాజరాజేశ్వరి సహిత రాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఫెర్రీ రోడ్డులోని పుష్కారఘట్ వద్ద గల శివాంహోలీబాత్ వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. పలు ఆలయాల్లో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, సతీమణి ఉదయలక్ష్మీ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నల్లంకుటుంబ సభ్యులు బారీ క్రెయిన్ సహాయంతో శివాంహోలీబాత్ పైకి వెళ్లి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భైరవపాలెంలోని కాళభైరవస్వామి ఆలయంలో మల్లాడి దంపతులు పూజ లు నిర్వహించారు.

వేలాదిగా సముద్ర స్నానాలు

అల్లవరం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): అల్లవరంలోని శివాలయాలు బుధవారం శివనామస్మరణలతో మార్మోగాయి. శ్రీరామ లక్ష్మణులతో శివలింగ ప్రతిష్ఠలతో పురాణ ప్రసిద్ధినొందిన రామేశ్వరం, లక్ష్మణేశ్వరం శివాలయాలతో పాటు పలు గ్రామాల్లో శివాలయాల వద్ద వేకువజాము నుంచి అభిషేకాలు ఘనంగా జరిగాయి. రామేశ్వరంలో సముద్ర స్నానాలకు, శివాలయాల్లో రుద్రాభిషేకాలు, శివ పూజలకు వేలాదిగా భక్తులు పోటెత్తారు. రామేశ్వరం తీరంలో సముద్ర స్నానాలకు వేలాదిగా తరలిరావడంతో అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ జి.హరీష్‌కుమార్‌లు తీరాన్ని సందర్శించారు. రామేశ్వరంలో ఆలయ చైర్మన్ అంగాని రామారావు, కమిటీ, ఈవో సలాది సత్యమహేంద్ర ఆధ్వర్యంలో భక్తుల సందర్శనకు ఏర్పాట్లు చేశారు. బీజేపీ నేత యాళ్ల దొరబాబుతో పాటు ప్రముఖులు రామేశ్వరం శివాలయాన్ని సందర్శించారు. రామేశ్వరం సముద్ర తీరంలో భక్తులు తయారు చేసిన ఇసుక శివలింగం అందరినీ ఆకట్టుకుంది. గోడి ఆనంద బాలయోగి ఆశ్రమాన్ని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ సందర్శించి పూజల్లో పాల్గొన్నారు. కొమరగిరిపట్నం, బెండమూర్లంక, గోడి, బోడసకుర్రు, గోడిలంక, అల్లవరం, తాడికోన, దేవగుప్తం తదితర శివాలయాల్లో అభిషేకాలు, జ్యోతిర్లింగార్చనలు జరిగాయి.

పంచామృతాలతో అభిషేకాలు

అంతర్వేది, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) వేకువజాము నుంచి శివాలయాల్లో భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. అంతర్వేది శ్రీపార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి, రామేశ్వరం శ్రీ కృతకృత్య రామలింగేశ్వరస్వామి, సఖినేటిపల్లి, మోరి, అంతర్వేది కొత్తపంతెన శివాలయాల వద్ద భక్తులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అంతర్వేది క్షేత్ర పాలకుని ఆలయం వద్ద భక్తులుగంటల కొలదీ క్యూలైన్‌లో వేచి ఉండి స్వామిని దర్శించుకున్నారు. శివాలయాల వద్ద దీపాలంకరణ చేశారు. అంతర్వేది దేవస్థానం,అంతర్వేది గునిశెట్టివారిపుంత, సైకిల్‌షాపు సెంటర్, వేంకటేశ్వరస్వామి ఆలయం, వినాయకనగర్, కాల్వమొగసెంటర్, హనుమాన్ జంక్షన్, మోరి, వీవీమెరక, టేకిశెట్టిపాలెం తదితర ప్రధానరహదారుల వెంబడి దీపారాధన చేశారు.

ఆకట్టుకున్న కళాకృతులు

మామిడికుదురు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): శివరాత్రి పురస్కరించుకుని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. అప్పనపల్లి పెద్దవీధి, మైనరురాజువీధి, సంతమార్కెట్‌లో ఏర్పాటు చేసిన వివిధ రకాల కళాకృతులు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ధర్మకోల్‌తో తయారుచేసిన అయోధ్య రామమందిరం, కరెన్సీ, విద్యుత్ దీపాలతో ఏర్పాటుచేసిన శివలింగాలు, అమ్మవారి ప్రతిరూపం, ఏడుకొండలస్వామి నమూనా తదితర కళాకృతులు భక్తుల మనస్సులను రంజిపంచేశాయి. అప్పనపల్లిలోని సాయివీరభద్ర స్వామి ఆలయం, పలుచోట్ల ఏర్పాటుచేసిన దీపాలంకరణ, విద్యుద్దీపాలంకరణ భక్తులను ఆకట్టుకున్నాయి. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తన్మయత్వం చెందారు.






అమలాపురం: రామలింగేశ్వరునికి అభిషేకం, కాట్రేనికోన: కుండలేశ్వరస్వామి, అల్లవరం: రామేశ్వరం తీరంలో ఇసుక శివలింగం, ముమ్మిడివరంలో ఉమాసూరేశ్వరస్వామికి అభిషేకాలు

ఇండియన్ బ్యాంక్‌పై బెంగళూరు స్పైకర్స్ విజయం

గొల్లవిల్లిలో నేషనల్ వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

గ్రామీణ క్రీడ వాలీబాల్‌ను ప్రోత్సహించాలి: ఎమ్మెల్యే



బెలూన్లు గాలిలోకి వదులుతున్న ఎమ్మెల్యేలు, నాయకులు

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో క్రీడలకు మహర్దశ వచ్చిందని అరిగెల శ్రీరంగయ్య నేషనల్ వాలీబాల్ టోర్నమెంటు గౌరవ అధ్యక్షుడు, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. గొల్లవిల్లి హైస్కూల్ క్రీడా మైదానంలో ఏఎస్ఆర్ నేషనల్ వాలీబాల్ పోటీలు బుధవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ప్రారంభ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో వైభవం కోల్పోయిన క్రీడలకు, క్రీడాకారులకు ఊపిరి పోస్తూ నేషనల్ వాలీబాల్ పోటీల ప్రారంభానికి సీనియర్ టీడీపీ నాయకుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ ఎంతో సాహసం చేశారన్నారు. తొలుత ఎంపీటీసీ దేశంశెట్టి నాగరత్నకుమారి జ్యోతి ప్రజ్వలన చేశారు. వాలీబాల్ ప్రాంగణాన్ని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. జాతీయ ఆటగాడు పండు క్రీడాజ్యోతిని ఆవిష్కరించారు. గొల్లవిల్లి యువత రూపొందించిన డిజిటల్ వేదిక ద్వారా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వాలీబాల్ కోర్టును ప్రారంభించారు. టోర్నమెంటు అధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, స్పోర్ట్స్ అథారిటీ అధికారి సురేష్‌కుమార్, టోర్నమెంటు ముఖ్య సలహాదారు అరిగెల నానాజీ, ప్రధాన కార్యదర్శి అరిగెల నరేష్, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, జనసేన నాయకుడు నల్లా శ్రీధర్, ఎంపీటీసీ వంగా గిరిజానాగకుమారి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

హోరాహోరీగా: గొల్లవిల్లి అరిగెల శ్రీరంగయ్య జాతీయ వాలీబాల్ పోటీల్లో మొదటి మ్యాచ్ బెంగళూరు స్పైకర్స్, తమిళనాడు ఇండియన్ బ్యాంకు జట్ల మధ్య హోరాహోరీగా సాగింది. చెరో రెండు సెట్లు సాధించడంతో బెస్ట్ ఆఫ్ ఫైవ్‌లో విజయం నిర్ధారణ అయ్యింది.

డ్రైనేజీ వ్యవస్థను చక్కదిద్దాలి

యానాం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): యానాం జీఎంసీబాలయోగి కాలనీలో డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉండటంతో అధికారులతో కలిసి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ డ్రైనేజీని పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న కల్వర్టు పూర్తిగా శిథిలమైనీటి ప్రవాహం మెయిన్‌కు డ్రైన్‌కి వెళ్లకుండా స్తంభించిపోవడంతో డ్రైనేజీ నీరు ఇంటి గుమ్మల్లోకి రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. మరమత్తులు చేపట్టాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.

ప్రతీ ఒక్కరిచేత ఓటు వేయించాలి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతీ గ్రాడ్యుయేట్ చేత ఓటు వేయించి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయానికి కృషి చేయాలని తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు దాట్ల పృథ్వీరాజ్ సూచించారు. ముమ్మిడివరంలోని పార్టీ కార్యాలయంలో అర్థాని శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ ప్రతినిధులు పట్టభద్ర ఓటర్లను పోలింగ్ కేంద్రానికి తీసుకువెళ్లి ఓటువేసే విధంగా బాధ్యతలు తీసుకోవాలన్నారు. చెల్లి అశోక్, గొలకోటి దొరబాబు, తాడి నరసింహారావు, పొద్దోకు నరసింహారావు, గుద్దటి జమి, దొమ్మేటి రమణకుమార్, దూడల స్వామినాయుడు, చిక్కాల అంజిబాబు, దాట్ల బాబు, గొల్లపల్లి గోపి, యాళ్ల ఉదయ్, నడింపల్లి శ్రీనివాసరాజు, మిమ్మితి చిరంజీవి, కురసాల శివబాబు పాల్గొన్నారు.

తరతరాల 'అలుగుల' సంబరం

శూలధారుల ఊరేగింపు



అమలాపురం రూరల్, ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి): ప్రతీఏటారంగాపురం, ఇమ్మిడివరప్పాడు గ్రామాల్లో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వీరభద్రుని సంబరాలు కరికాల భక్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తారు. లింగధారులైన కరికాల భక్తులు ఏప్రాంతంలో జీవిస్తున్నా ప్రతీఏటా అలుగుల సంబరం నిర్వహించడం ఆనవాయితీ. బుగ్గలపైనా, మెడపైనా అలుగులు(శూలాలు) ధరించి వాటికి అటూ ఇటూ కత్తులు అమరుస్తారు. అలుగులు పొడిచినప్పుడు రక్తం జియ్యిమని తన్నుకు వస్తున్నా వారు పట్టించుకోరు. బుధవారం ఉదయం ఆయా గ్రామాల్లోని స్థానిక వీరభద్రుని ఆలయాల వద్ద నుంచి అలుగులు ధరించిన యువకులను ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగించారు. భవిష్యత్ తరాలవారికి ఈసంప్రదాయాన్ని అందించే లక్ష్యంతోనే తాము ఏటా ఈఉత్సవాలను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. సోమవారం రాత్రి ఆలయ ప్రాంగణాల్లో ఏర్పాటుచేసిన నిప్పులగుండంలో నడిచి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం ప్రభలను గ్రామాల్లో ఊరేగించారు. ఇమ్మిడివరప్పాడులో నూతనంగా నిర్మించిన శ్రీభద్రకాళీ సమేత వీరభద్రేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

కేశవస్వామికి వెండి కవచం బహూకరణ



అంతర్వేది, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఉన్న ఉపాలయ కేశవస్వామికి అంతర్వేది గ్రామానికి చెందిన బెల్లంకొండ నాగు-భానుకళ దంపతులు 2.900కిలోల వెండి కవచాన్ని బహూకరించారు. తొలుత అర్చకులు వెండి కవచానికి సంప్రోక్షణ పూజా కార్యక్రమాలు నిర్వహించి కేశవస్వామికి అలంకరించారు. ఆలయ సంప్రదాయ మర్యాదలతో దాతలకు దర్శనం కల్పించి, స్వామివారి చిత్రపటం, ప్రసాదం ఆలయ అధికారులు అందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బెల్లంకొండ నరసింహారావు(అబ్బులు), దాత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి వెండి ఆభరణాలు బహూకరణ

ముమ్మిడివరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలోని శ్రీధర్మశాస్త అయ్యప్పస్వామికి రూ.1.50లక్షల విలువైన వెండి ఆభరణాలను అల్లూరి రామచంద్రరాజు, సూర్యనారాయణరాజు దంపతులు బుధవారం కానుకగా సమర్పించారు. ఆలయ అర్చకులు పవన్‌శర్మ వాటికి సంప్రోక్షణ, ప్రత్యేక పూజలు జరిపించి స్వామికి అలంకరించారు. ఆలయ కమిటీ నాయకులు పెన్మెత్స జగ్గప్పరాజు, సరిపెల్ల రామకృష్ణంరాజు, కాజులూరి రామలింగేశ్వరరావు, మహీధరవర్మ, వేములవలస చిన్నారావు, ఆకుల శ్రీనివాసరావు, అయ్యప్పస్వామి సేవాసమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి అందజేత

ముమ్మిడివరం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ బాలికల వసతిగృహంలో వసతి పొందుతూ ఇంటర్మీడియట్ చదువుతున్న 50మంది విద్యార్థినులకు షెడ్యూల్డు కూలాల సంక్షేమ సంఘ ముమ్మిడివరం శాఖ ఆధ్వర్యంలో పరీక్షా సామగ్రిని అందించారు. కార్యక్రమంలో బి.రమణశ్రీ, కాశి వెంకటాచార్య, ఎం.ఆశీర్వాదం, కాశి జగ్జీవన్‌రామ్, జనిపల్లి సత్యనారాయణ, పి.డేనియల్, కాశి అప్పారావు, నక్కా శ్రీనివాస్, కె.రాము, కె.భైరవస్వామి, డి.బాబూరావు, పాము సత్యనారాయణ పాల్గొన్నారు.

రాజోలులో ఘనంగా వీరభద్రుని సంబరం

రాజోలు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాజోలులోశ్రీవీరభద్రస్వామి, అయ్యప్పస్వామివార్ల 39వ ఏకాహ మహాశివరాత్రి మహోత్సవాలు మహాశివరాత్రి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం భక్తిశ్రద్ధలతో వీరభద్రుడి సంబరం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున శ్రీవీరభద్రస్వామి, అయ్యప్పస్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాజోలు పురవీధుల్లో మేళతాళాలతో సంబరాన్ని నిర్వహించారు. శ్రీవీరభద్రస్వామి-భద్రకాళీ అమ్మవార్లకు మేలుకొలుపు, వశిష్ఠ గోదావరి స్నానం, పాలాభిషేకం చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, భజన కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. మార్చి1న అఖండ అన్నసమారాధన నిర్వహిస్తామని చెప్పారు.

వేడుకగా వీరభద్రుడి ఊరేగింపు

అంబాజీపేట, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలోని ఉన్న శ్రీభద్రకాళీ సమేత వీరభద్రుని సంబరం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు విభూది పండ్లను గ్రామంలో ఊరేగించారు. రాత్రి నిర్వహించిన సంబరంలో తీన్‌మార్ వాయిద్యాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

ఆత్మసంరక్షణపై బాలికలకు శిక్షణ

రాజోలు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజోలు గురుకుల బాలికల పాఠశాలలో సమగ్రశిక్ష రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్ కార్యక్రమాన్ని నిర్వహించామని పాఠశాల ప్రిన్సిపాల్ టి.లలితకుమారి తెలిపారు. ఉపాధ్యాయురాలు సరిత గురుకుల పాఠశాల విద్యార్థినులకు ఆత్మసంరక్షణకు సంబంధించిన శిక్షణ తరగతులు మూడు రోజులు నిర్వహించారని ప్రిన్సిపాల్‌తెలిపారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు

అంబాజీపేట, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మాచవరంలో ఉన్న శ్రీయువ గణపతి ఆలయంలో శివరాత్రి సందర్భంగా స్వామి వార్కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో స్వామి వార్కి లక్ష చామంతి పూజ చేశారు. ఈసందర్భంగా స్వామి వార్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో ఏకాహం నిర్వహించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ మహిళ బుధవారం మృతిచెందింది. అనాతవరం కైరంవారి వీధికి చెందిన పేరూరి శ్రీమహాలక్ష్మి(32) ఆదివారం తోటికోడలు లక్ష్మితో కలిసి కొమరగిరి శుభ కార్యానికి వెళ్లి ఇంటికి తిరిగివస్తూ అనాతవరంలో రోడ్డు దాటుతుండగా అటువైపు స్కూటీపై వెళుతున్న మెడికల్ విద్యార్థినులు ఢీకొనడంతో మహాలక్ష్మి తీవ్రంగా గాయపడింది. మహాలక్ష్మి అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆమెకు భర్త నాగబాబు, ముగ్గురు అమ్మాయిలు ఉన్నారు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సహాయం

మలికిపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రామరాజులంకకు చెందిన దేశినీడి అయ్యప్ప కిడ్నీ వ్యాధితో బాధపడుతుండడంతో బోనం వీరన్న-కాంతమ్మ రక్త సంబంధీకులు సమకూర్చిన రూ.35వేలును అయ్యప్ప కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ముద్దల సత్యనారాయణ, దుర్గారావు, నాగేశ్వరరావు, బోనం రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర టైలర్స్ ఉపాధ్యక్షుడిగా వెంకటరమణారావు



రాజోలు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర టైలర్స్ కోఆపరేటివ్ సొసైటీ పరిరక్షణ కమిటీ ఉపాధ్యక్షుడిగా రాజోలుకు చెందిన స్టైలో టైలర్ కడలి వెంకటరమణారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు పోగుల మల్లికార్జునరావు నుంచి ఉత్తర్వులు అందాయని వెంకటరమణారావు బుధవారం తెలిపారు. వెంకటరమణారావు నియామకం పట్ల రాజోలు పట్టణ టైలర్ సంఘ సభ్యుడు హర్షం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ఎంపీపీ కేతా శ్రీను, రాజోలు దివిలియమ్స్ హోమ్ టైలర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుబ్బల నరసింహస్వామి(కుమార్) అభినందనలు తెలిపారు.

ఘనంగా లూర్దుమాత యాత్ర మహోత్సవం




యానాం పురవీధుల్లో లూర్ధుమాత యాత్ర మహోత్సవం

యానాం, ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి): యానాం రోమన్ కేథలిక్ చర్చి ఆవరణలో గల లూర్ధుమాత ఆలయంలో బుధవారం యాత్ర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులే కాకుండా యానాం పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు కులమతాలకు అతీతంగా వచ్చి ప్రార్థనలు చేసి కొవ్వొత్తులు వెలిగించారు. ఆర్‌సీ చర్చి, లూర్ధుమాత ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఎనిమిది రోజులుగా ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం వరకు నవదిన ప్రార్థనలు జరిగాయి. ఉదయం నుంచి చర్చిలో వాక్యపరిచర్య, స్వస్థతా ప్రార్థనలు, అనంతరం విశాఖపట్నం అతిమేత్రాసనము పాలనాధికారి డాక్టర్ పొలిమేర జయరావు ఆధ్వర్యంలో సమిష్టి దివ్య పూజబలి అనంతరం రాత్రి 7.30కు లూర్ధుమాత పురప్రదక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి మునిస్వామి, చర్చి ఫాదర్ మారియాదాస్ పూజలు నిర్వహించారు. పుర ప్రదక్షణ అనంతరం బాణసంచా కాల్చారు.

మండపేట



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి ఒకరోజు ఆదాయం రూ.2.20లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొ న్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.2,20,516 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

వెంకన్న ఆలయంలో సుదర్శన హోమం: వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో 21 రోజులపాటు గోవిందమాల ధరించి దీక్ష చేపట్టిన మాలధారులు బుధవారం స్వామివారికి ఇరుముడులు సమర్పించారు. వందలాదిగా వచ్చిన స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలను చేపట్టారు. మాలధారులు ఇరుముడి సమర్పించి దీక్ష విరమించారు. ఉపకమిషనరుతో పాటు కూటమి శ్రేణులు పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న గోవిందమాలధారులు

ఘనంగా స్వామివారి మాస కల్యాణం



ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో శ్రవణా నక్షత్ర మాస కల్యాణాన్ని బుధవారం ఘనంగా జరిపారు. స్వామివారిని కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను జరిపి స్వామివారి మాస కల్యాణాన్ని చేశారు. ఆలయ ఈవో బీహెచ్వీ రమణమూర్తి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు అందించారు. అశేష భక్తజనం పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



ఆత్రేయపురం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోవిందదీక్షను ప్రారంభించిన భక్తులు

గోవిందమాల దీక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దశమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం పలువురు భక్తులు గోవిందమాల దీక్షలు ప్రారంభించారు. పదకొండు రోజులపాటు ఈ దీక్షలను నిర్వహించనున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత వసతి, ఏర్పాట్లు చేశారు. వారం రోజులపాటు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. వీటికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి గ్రామోత్సవం

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం గాంధీ సెంటర్ సమీపంలో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి గ్రామోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవాల ముగింపు సందర్భాన్ని పురస్కరించుకుని స్వామివారిని పల్లకీలో ఊరేగుతూ గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారికి నైవేద్యాలు, కానుకలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

మండపేట, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం కేశవరం, ద్వారపూడి రైల్వే పట్టాలపై గుర్తు తెలియని ఇద్దరు మృతి చెందారని రాజమహేంద్రవరం రైల్వే పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం..బుధవారం ఉదయం పదిగంటల సమయంలో కేశవరం రైల్వేగేటు సమీపంలో కడియం ద్వారపూడి రైల్వేస్టేషన్ మధ్య గుర్తు తెలియని వ్యక్తి(50) సామర్లకోట వైపు వెళ్లే రైలు ఢీకొట్టడంతో చనిపోయాడని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు ముఖం గుర్తుపట్టలేని విధంగా ఉందని రైల్వే పోలీసులు చెప్పారు. మంగళవారం సాయంత్రం ద్వారపూడి అనపర్తి రైల్వేస్టేషన్ మధ్య 30 ఏళ్ల గుర్తు తెలియని యువకుడు రైల్వే ట్రాక్‌పై తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. రెండు మృతదేహాలను రాజ మహేంద్రవరం ప్రభుత్వ మార్చురీలో ఉంచామన్నారు. ఈ ప్రమాదాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సమాచారం కోసం సీఐ 9440627551, ఎస్ఐ 9441444022 మొబైల్స్‌కి ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చన్నారు.



ఆలమూరు విక్రమభట్టీశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

శంభో..శివ శంభో

• శివ నామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు • ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు



ఆత్రేయపురం మండలం వసంతవాడ పార్వతీ, పరమేశ్వరుల ఆలయంలో ఎమ్మెల్యే సత్యానందరావు పాల్గొన్న దృశ్యం



ఆత్రేయపురం మండలం వసంతవాడలో పార్వతీ, పరమేశ్వర్లను కరెన్సీ నోట్లతో అలంకరించిన దృశ్యం

ఆలమూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని శైవక్షేత్రాలు బుధవారం శివనామస్మరణతో మార్మోగాయి. ఉదయం నుంచే భక్తులు శైవక్షేత్రాల్లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఆలమూరు విక్రమ భట్టీశ్వరస్వామి, పెనికేరు ఇష్టకాంతేశ్వరస్వామి, జొన్నాడ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, చింతలూరు పృథ్వీశ్వరస్వామి, మడికి సోమేశ్వర స్వామి, మూలస్థానం మూలేశ్వరస్వామి ఆలయాలతోపాటు చొప్పెల్ల, నర్సిపూడి, నవాబుపేట, మోదుకూరు, గుమ్మిలేరు, పెదపళ్ల, పినపళ్ల, సంధిపూడి, కలవచర్లలో ఉన్న శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలమూరు విక్రమ భట్టీశ్వరస్వామి ఆలయంలో సాయంత్రం అఖండ దీపారాధన కార్యక్రమం ఆకట్టుకుంది. మడికి అంతరాష్ట్ర అభయాంజనేయ కూరగాయ వర్తక సంఘం అధ్వర్యంలో అన్న సమారాధన చేశారు. అన్న సమారాధనకు ఉభయ గోదావరి జిల్లాల రైతులు, వ్యాపారులు వచ్చారు. జొన్నాడ విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద రావులపాలెం డొక్కా సీతమ్మ సేవా సమితి అధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో రథోత్సవం: ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారంలో ఉన్న మూలేశ్వరస్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి సందర్భంగా శివయ్య రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంఎస్ఆర్ కృష్ణ పర్యవేక్షణలో సాగిన రథోత్సవంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వసంతవాడలో ఎమ్మెల్యే బండారు పూజలు

ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి సందర్భంగా శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. వసంతవాడ పార్వతీ, పరమేశ్వరుల ఆలయంలో భక్తులు స్వామివారికి కరెన్సీ నోట్లను సమర్పించగా అలంకరించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడు సంజీవ్, పార్టీ ఎన్నికల పరిశీలకులు పీవీ గణేష్‌కుమార్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ర్యాలీ ఉమా కమండలేశ్వరస్వామి క్షేత్రంలో వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం రథోత్సవాన్ని కన్నుల పండువగా జరిపారు. ఆలయ ఈవో బీహెచ్వీ రమణమూర్తి ఏర్పాట్లు చేపట్టారు. వాడపల్లి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో పుష్పాలతో మహాశివరాత్రి అని అలంకరించారు. శివుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు.

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. యండగండి, పామర్రు, అముజూరు, పాణింగపల్లి, సత్యవాడ, దంగేరు, గంగవరం, బాలాంత్రం, యర్రపోతవరం, కుందూరు, భట్లపాలిక, మసకపల్లి తదితర గ్రామాల్లో శివాలయాలు కిక్కిరిశాయి. పాతకోట, తామరపల్లి, సుందరపల్లి, పాణింగపల్లి, గంగవరం, అముజూరు తదితర గ్రామాలో భక్తులు యాత్రీకులకు ప్రసాదం పంపిణీ చేశారు.



కపిలేశ్వరపురం: పడమరఖండ్రిక ఉయ్యాల-జంపాల క్షేత్రం వద్ద స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కోటిపల్లిలో కోటి దీపారాధన: కోటిపల్లి క్షేత్రంలో కోటి దీపారాధన నిర్వహించారు. బేడా మండపంపై స్వామి వారి ఉత్సవమూర్తులకు ఏర్పాటు చేశారు. కార్మికశాఖా మంత్రి సుభాష్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. దీపం వెలిగించి కోటి దీపోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వాసంశెట్టి సత్యం, చీకట్ల సోమేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

బారులుతీరిన భక్తులు

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని పలివెల ఉమాకొప్పేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మందపల్లి శనేశ్వరస్వామి ఆలయంలో గల ఉమానాగేంద్రస్వామి ఆలయానికి, కొత్తపేట హరిహర దేవాలయ ప్రాంగణంలో గల శివాలయానికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పలివెల ఉమాకొప్పేశ్వరస్వామి శివలింగానికి అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారి రథోత్సవంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కూటమి నేతలు పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని వారు పూజలు చేశారు. అనంతరం తీర్థం కొనసాగింది. ఎస్ఐ జి.సురేంద్ర పర్యవేక్షణలో సిబ్బంది బందోబస్తు చేశారు.

ఏడిద సంఘమేశ్వరస్వామి ఆలయంలో

మండపేట(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం ఏడిద సంఘమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. మండపేట రూరల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. స్వామివారిని స్థానిక ప్రజా ప్రతినిధులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. మండపేటలో రథంగుడిలోనున్న అగస్త్రేశ్వరస్వామికి, మండపేట ఆలమూరు రోడ్డులో వున్న అయ్యప్పస్వామి ఆలయం వద్ద వున్న శివుడికి యువనేత వి. సాయికుమార్‌బాబు పూజలు చేశారు. అనంతరం స్వామివారికి బూర్లు, పాలతో అభిషేకం చేశారు. ద్వారపూడి, కేశవరం, తాపేశ్వరం, ఇప్పనపాడు, యేడిద, పాలతోడు, వెలగతోడు, అర్తమూరు, తదితర గ్రామాల్లోని శివాలయాల్లో శివరాత్రి వేడుకలను జరిపారు. ఏడిదలో సంఘమేశ్వరస్వామికి బుధవారం అర్ధరాత్రి లింగోద్భవ పూజలు జరిపారు.

ఎమ్మెల్యే వేగుళ్ల పూజలు: మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పట్టణంలో వున్న అగస్త్రేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు వేదాశీ ర్వచనం అందజేశారు. అనంతరం ఆయన పలు ఆయా శైవక్షేత్రాల్లో జరిగిన శివరాత్రి వేడుకల్లో పాల్గొన్నారు.

రాయవరం(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రిని మండలంలోని శైవక్షేతాలు బుధవారం శివనామ స్మరణతో మార్మోగాయి. మండలంలోని సోమేశ్వరం బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో పురోహితుడు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో వేకువజాము నుంచే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చ నలు చేశారు. అనంతరం స్వామివారిని వెండి కవచం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. పడమర దిక్కున ఉన్న సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు జరిపారు. రాయవరం పార్వతీ సమేత రాజేశ్వరస్వామి, అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, లొల్ల ఉమా రామలింగేశ్వరస్వామి, చెల్లూరు అగస్త్రేశ్వరస్వామి, మాచవరం భోగేశ్వరస్వామి, పసలపూడి, నదురుబాద, వి.సావరం, వెదురుపాక గ్రామాల్లోని శైవక్షేత్రాల్లో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. వేకువజాము నుంచే భక్తులు స్వామివారిని దర్శించేందుకు బారులు తీరారు. ఆయా శివాలయాల వద్ద భక్తులు జ్యోతిర్లింగార్చనలు, సహస్ర జ్యోతిర్లింగార్చనలు జరప డంతో పాటు భజన బృందాలు భజనలు చేశారు. సోమేశ్వరంలో మహా శివరాత్రిని పురస్కరించుకుని వర్తక సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. వెదురుపాక విజయదుర్గా పీఠంలో అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో భవాని శంకర అష్టలింగేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం జరిపారు.

కపిలేశ్వరపురం(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా బుధవారం మండలంలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. వేకువజాము నుంచే భక్తులు అగస్త్రేశ్వర పాప వినాశేశ్వరస్వామిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అంగర ఖణ్వలింగేశ్వరస్వామి, కోరుమిల్లి సోమేశ్వరస్వామి, పడమరఖండ్రిక ఉయ్యాల-జంపాల క్షేత్రం వద్ద అన్నపూర్ణా సమేత త్రయంబకేశ్వరస్వామి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు బారులుతీరారు. వల్లూరులో పార్వతీ సమేత అగస్త్రేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం వద్ద వల్లూరి కామన్న, సావిత్రి దంపతుల కుమారుడు వీరబాబు, జానకీరత్నం ఆధ్వర్యంలో అన్నసమారాధన చేశారు. రాత్రి కపిలేశ్వరపురం, అంగర, వల్లూరు తదితర గ్రామాల్లోని ఆలయాల వద్ద, ప్రధాన వీధుల్లో దీపాలంకరణ చేశారు. గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాల భక్తులు దీపాలను సందర్శించి పూజలు చేశారు.



రావులపాలెం: ముమ్మిడివరప్పాడులో పూర్ణాలంకరణలో ఉమావీరేశ్వరస్వామివారు

రావులపాలెం(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని ఆయా శైవక్షేత్రాల్లో పలు పూజలు జరిగాయి. వేకువ జామునే భక్తులు శైవక్షేత్రాల్లో స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, అష్టోత్తరసహస్రనామ పూజలు, రుద్రాభిషేకం చేశారు. అమ్మవారికి కుంకుమ పూజలు ఘనంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.

దక్ష గుండం వద్ద అఖండ దీపారాధన

ద్రాక్షారామ(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామలో దక్ష గుండం వద్ద ఉన్న ఘంటాంబిక అమ్మవారి ఆలయం వద్ద మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం రాత్రి అఖండ దీపారాధన జరిగింది. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దంపతులు, వ్యాపారవేత్త సత్తి సుబ్బారెడ్డి దంపతులు అఖండ దీపారాధన ప్రారంభించారు. కోటిపల్లి రోడ్డులో అమ్మవారి ఆలయ గోపురం వద్ద నుంచి ఆలయం వరకు ఇరువైపులా దీపాలు వెలిగించారు. ఆలయం వద్ద శివలింగాలు చెక్కలతో ఏర్పాటు చేసి ప్రమిదలతో దీపాలు వెలిగించారు. దీపాలతో శివలింగాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఘంటాంబిక అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో మహిళలు దీపారాధనలో పాల్గొన్నారు.

పుష్ప శివలింగం దర్శించిన భక్తులు: ద్రాక్షారామ బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన పుష్ప శివలింగం పలువురు భక్తులు దర్శించుకున్నారు.

మండలంలో శివరాత్రి వేడుకలు: రామచంద్రపురం మండలంలో శుక్రవారం శివరాత్రి వేడుకలు జరిగాయి. ఆదివారపుపేట శివబాలయోగి ఆశ్రమంలో ప్రత్యేక పూజలు జరిగాయి. రాత్రికి గౌరీశంకర కల్యాణం ఘనంగా జరిగింది. ఏరుపల్లి, హసన్‌బాద, యనమదల, నరసాపురపేట తదితర గ్రామాల్లో శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి.

రామచంద్రపురం పట్టణంలో: రామచంద్రపురంనున్న అగస్త్రేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు జరిగాయి. తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఉర్రూతలూగించిన సంగీత విభావరి: ద్రాక్షారామలో జానపద, సినీ నేపథ్య గాయకురాలు మంగ్లీ తన స్వరమాధుర్యంతో మహాశివుడికి స్వరార్చన చేశారు. మహాశివరాత్రి పురస్కరించుకుని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ద్రాక్షారామ పీవీఆర్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన భక్తి సినీ సంగీత విభావరి ఆద్యంతం ఆకట్టుకుంది. సినీ గాయకులు మాళవిక, వైష్ణవి, మృదుల, కృష్ణ చైతన్య, మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, అధిక సంఖ్యలో భక్తులు సినీ సంగీత విభావరి, నృత్య ప్రదర్శనలను తిలకించారు.



కొత్తపేట:పలివెల ఉమాకొప్పేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు చేస్తున్న భక్తులు

పోలీసులకు సీసీ కెమెరాల అందజేత

మండపేట, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏర్పాటు చేసేందుకు అవసరమైన సీసీ కెమెరాలను పట్టణ సీఐ దారం సురేష్‌కు మండపేట లయన్స్ క్లబ్ అందజేశారు. ఇరవై సీసీ కెమెరాలను లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చిలుకూరి బాపిరాజు అందజేశారు. కార్యక్రమంలో డి. తిరుమలరావు, సి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



రామచంద్రపురం డిస్ట్రిబ్యూటరీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో అఖిల

ద్రాక్షారామ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల పోలింగ్ గురువారం జరగనుంది. బుధవారం రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ కేంద్రంలో వివిఎస్ఎం కళాశాలలో ఏర్పాటు చేసిన 23 పోలింగ్ కేంద్రాల సామగ్రిని డిస్ట్రిబ్యూటరీ కేంద్రంలో అధికారులు, సిబ్బందికి అందచేశారు. డిస్ట్రిబ్యూటరీ కేంద్రంలో ఆర్డీవో అఖిల పోలింగ్ సామగ్రి పంపిణీ, తరలింపుపై పలు సూచనలు చేశారు. డిస్ట్రిబ్యూటరీ కేంద్రం నుంచి సామగ్రితో అధికారులు, సిబ్బందివెళ్లారు.

రామచంద్రపురంలో నాలుగు కేంద్రాలు: గురువారం జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నాలుగు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. రామచంద్రపురం మండల పరిషత్ కార్యాలయం, పాత తహశీల్దార్ కార్యాలయం, కృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాల, మండల మహిళా సమాఖ్య కార్యాలయాలు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ సక్రమంగా జరిపేందుకు సర్వం సిద్ధం చేశారు.

ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశామని అసిస్టెంట్ రిటర్నింగ్ ఎన్నికల అధికారి పి.రాజేశ్వరరావు తెలిపారు. పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. మండల పరిషత్, ప్రాథమిక పాఠశాలలోని మూడు పోలింగ్ కేంద్రాలలో గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఓటు వినియోగించుకోనున్నారు.

కపిలేశ్వర పురం(ఆంధ్ర జ్యోతి): మండలంలో గురువారం నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నిక లకు సంబంధించి సర్వం సిద్ధం చేసినట్టు తహశీల్దార్ చిన్నారావు తెలిపారు. బుధవారం ఎన్నికల నిర్వహణపై సిబ్బందితో సమావేశం జరిపారు. కపిలేశ్వరపురం మండల పరిషత్ కార్యాలయంలో ఒకటి, జిల్లా పరిషత్ కార్యాలయంలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేసినట్టు తహశీల్దార్ చిన్నారావు తెలిపారు.

రాయవరం(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తహశీల్దారు ఐవీ శెట్టి తెలిపారు. బుధవారం రాయవరంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సామగ్రి బుధవారం సాయంత్రం నాటికి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నాయి. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సదుపాయాలు కల్పించామని తెలిపారు.

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహశీల్దార్ బండి ముత్యం జయరావు తెలిపారు. కె.గంగవరం ఉన్నత పాఠశాలలో మూడు బూత్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకూ పోలింగ్ జరుగుతుం దని తెలిపారు.

ఆలమూరు(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా గురువారం జరిగే పోలింగ్‌కు ఆలమూరులో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ స్టేషన్ల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ అధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏడు మండలాల్లో పోలింగ్ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్డీవో శ్రీకర్ తెలిపారు. కొత్తపేట నియోజకవర్గంలో నాలుగు మండలాలకు సంబంధించి 17 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కొత్తపేటలో 6, రావులపాలెంలో 5, ఆత్రేయపురంలో 3, ఆలమూరులో 3, అయినవిల్లిలో 3, పి.గన్నవరంలో 4, అంబాజీపేటలో 3 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ జరుగుతుందన్నారు.

మండపేట(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 8 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.

కేశవస్వామికి వెండి కవచం బహూకరణ

అంతర్వేది, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఉన్న ఉపాలయ కేశవస్వామికి అంతర్వేది గ్రామానికి చెందిన బెల్లంకొండ నాగు-భానుకళ దంపతులు 2.900కిలోల వెండి కవచాన్ని బహూకరించారు. తొలుత అర్చకులు వెండి కవచానికి సంప్రోక్షణ పూజా కార్యక్రమాలు నిర్వహించి కేశవస్వామికి అలంకరించారు. ఆలయ సంప్రదాయ మర్యాదలతో దాతలకు దర్శనం కల్పించి, స్వామివారి చిత్రపటం, ప్రసాదం ఆలయ అధికారులు అందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బెల్లంకొండ నరసింహారావు(అబ్బులు), దాత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి వెండి ఆభరణాల బహూకరణ

ముమ్మిడివరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలోని శ్రీధర్మశాస్త అయ్యప్పస్వామికి రూ.1.50లక్షల విలువైన వెండి ఆభరణాలను అల్లూరి రామచంద్రరాజు, సూర్యనారాయణరాజు దంపతులు బుధవారం కానుకగా సమర్పించారు. ఆలయ అర్చకులు పవన్‌శర్మ వాటికి సంప్రోక్షణ, ప్రత్యేక పూజలు జరిపించి స్వామికి అలంకరించారు. ఆలయ కమిటీ నాయకులు పెన్మెత్స జగ్గప్పరాజు, సరిపెల్ల రామకృష్ణంరాజు, కాజులూరి రామలింగేశ్వరరావు, మహీధరవర్మ, వేములవలస చిన్నారావు, ఆకుల శ్రీనివాసరావు, అయ్యప్పస్వామి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



పలివెలలో జాతీయ నాయకుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న వెంకటేశ్వర్లు తదితరులు

మహర్షి సాంబమూర్తికి ఘన నివాళి

కొత్తపేట, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధుడు, మహర్షి బలుసు సాంబమూర్తి జయంతిని పురస్కరించుకుని పలివెల మహాత్మాగాంధీ అధ్యయన సంస్థ అధ్యక్షుడు దుళ్ల వెంకటేశ్వర్ల ఆధ్వర్యంలో సాంబమూర్తి విగ్రహంతో పాటు జాతీయ నాయకుల విగ్రహాలకు పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడుగానే కాకుండా మద్రాసు అసెంబ్లీ స్పీకర్‌గా పలు సేవలు అందించిన మహనీయుడు సాంబమూర్తి అని కొనియాడారు. కార్యక్రమంలో కంకటాల శ్రీరామమూర్తి, ఎస్.గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర టైలర్స్ ఉపాధ్యక్షుడిగా వెంకటరమణారావు

రాజోలు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర టైలర్స్ కోఆపరేటివ్ సొసైటీ పరిరక్షణ కమిటీ ఉపాధ్యక్షుడిగా రాజోలుకు చెందిన స్టైలో టైలర్ కడలి వెంకటరమణారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు పోగుల మల్లికార్జునరావు నుంచి ఉత్తర్వులు అందాయని వెంకటరమణారావు బుధవారం తెలిపారు. వెంకటరమణారావు నియామకం పట్ల రాజోలు పట్టణ టైలర్ సంఘ సభ్యుడు హర్షం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ఎంపీపీ కేతా శ్రీను, రాజోలు దివిలియమ్స్ హోమ్ టైలర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుబ్బల నరసింహస్వామి(కుమార్) అభినందనలు తెలిపారు.